ప్రజాశక్తి

శనివారం 22 ఏప్రిల్ 2023

పెన్షన్, జిపిఎఫ్ అదాలత్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన పెన్షన్, జిపిఎఫ్ అదాలత్ కు విశేష స్పందన లభించింది. ఈ అదాలత్‌కు జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెన్షన్, జిపిఎఫ్‌ల చందాలు, క్లెయిములకు సంబంధించి అనేకమంది పెన్షన్ దారులు, ఉద్యోగులు హాజరై వారి వారి సమస్యలను అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా పెన్షన్‌కు సంభవించి 25 ధరఖాస్తులు, జిపిఎఫ్‌కు సంబంధించి 60 ధరఖాస్తులు రాగా, వాటన్నిటినీ పరిష్కరించటం విశేషం.

హాజరైన అకౌంటెంట్ జనరల్

కష్టానికి దక్కని ప్రతిఫలం

- చింతపండు ధర పతనం
- కిలో రూ.20కు అమ్మకాలు
- దళారులతో మోసపోతున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - అనంతగిరి

గిరిజనుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కలేదు. ఎంతో శ్రమించి చింతపండును సేకరించి వారపు సంతకు తీసుకెళ్తున్నా దళారుల బారిన పడి మోసపోతున్నారు. దళారులు అంతా సిండికేట్‌గా మారి చింతపండును తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, గిరిజనులకు రవాణా కూడా ఖర్చులు కూడా రాకపోవడంతో ఆర్థికంగా సతమతం అవుతున్నారు.

గిరిజన రైతులకు ఆదాయాన్నిచ్చే చింతపండు, జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లభించ లేదు. దళారుల పెత్తనంతో గిరిజనులు మోస పోతున్నారు. జిసిసి ముందుకు వచ్చి డిఆర్ డిపోలు లేదా ప్రధానమైన వారపు సంతలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. మైదాన ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యాపారస్తులు గ్రామాలు, వారపు సంతలలో కేజీ చింతపండు రూ.20లకు కొనుగోలు చేయడమే కాకుండా కొలతలలో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. గిరిజనులకు తెలియకుండా 50 కేజీ తూనికల్లో . 15 నుండి 20 కేజీల వరకు మోసం చేస్తున్నారు. ఈ విధంగా గిరిజనుల కష్టార్జితాన్ని సొమ్ము చేసుకుంటున్నారు.

మండలంలోని పెద్దబిడ్డ, గుమ్మ, వాలసి, లుంగపర్తి, వెంగడ, అనంతగిరి, కొండిబా, బీంపోలు, గుమ్మకోట తదితర పంచాయతీ గ్రామాలలో ఒక్కొక్క రైతు 1000 నుండి 3000 కేజీలకు పైగా చింతపండు సేకరిస్తున్నారు. సేకరించిన చింతపండును రైతులు అనంతగిరి, డముకు, కాశీపట్నం, గుమ్మకోటలో వారపు సంతలలో విక్రయిస్తున్నారు. కిలో చింతపండు రూ.20లకు కొనుగోలు చేయడంతో గిరిజనుల కష్టానికి తగిన ఫతిఫలం లేకుండా పోతుంది. ఇదిలా ఉండగా జీడి పిక్కలు కిలో రూ.90 నుండి 100ల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా తూనికలలో దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. బెట్టు కాటాలపై గతంలో గిరిజన సంఘాలు వారపు సంతల్లో పోరాటాలు నిర్వహించినప్పటికీ వాటిని సైతం లెక్క చేయకుండా ఇష్టాం రాజ్యంగా దళారులు వ్యవహరిస్తున్నారు. విజయనగరం, ఎస్.కోట, పెందుర్తి ఇతర మైదాన ప్రాంతాలకు చెందిన దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయవలసిన జిసిసి అధికారులు స్పందించక పోవడంతో దళారుల దందా కొనసాగుతుంది.

డముకు వారపు సంతలో చింతపండు విక్రయాలు

కేంద్ర మంత్రి మురళీధరన్‌ను కలిసిన ఆదివాసీ జెఎసి నాయకులు

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ చేసిన

అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించొద్దు

- కేంద్ర మంత్రికి ఆదివాసీ జెఎసి వినతి

ప్రజాశక్తి - రంపచోడవరం

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ ఎపి అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఆమోదించ వద్దని ఎపి ఆదివాసీ జెఎసి ఛైర్మన్ తమర్భ బాబురావునాయుడు ఆధ్వర్యాన శుక్రవారం రాజమండ్రిలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్‌కు, బిజెపి నాయకులు దగ్గుబాటి పురంధేశ్వరి, సునీల్ దియోదర్, సోము వీర్రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది మార్చి 24న అసెంబ్లీ చేసిన ఈ తీర్మానం వల్ల ఆదివాసీల్లో తీవ్రమైన అభద్రత నెలకొందని తెలిపారు. 1976 చేర్చిన కులాల వల్ల ఇప్పటికే ఆదివాసీలకు ఎంతో నష్టం జరిగిందని, అలాంటిది సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిన 40 లక్షల జనాభా ఉన్న బోయ వాల్మీకి, బెంతు, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన ఆదివాసీలకు మరింత నష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా, అశాస్త్రీయమైన పద్ధతిలో రాజకీయ లబ్ధి కోసం ఈ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఇదే పద్ధతిలో ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆదివాసీలకు ద్రోహం చేసే విధంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ తీర్మానాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ కేంద్రం ఆమోదించకుండా చూడాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు కురుసా ఉమామహేశ్వరరావు, కూడ కృష్ణారావు, వంపూరి గంగులయ్య, ముఖి శేషాద్రి, రామారావు దొర, మొడియం శ్రీనివాసరావు, సోమెల సింహాచలం, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రెడ్డి, కంగల శ్రీనివాసరావు, మాసాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై పూర్తి స్థాయి విచారణ చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని కోట ఆశ్రమ పాఠశాల విద్యార్థి బట్ట లక్ష్మి (13) మృతిపై పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్‌కు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లె రెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కారణాలు ఏవైనా సకాలంలో వైద్యం అందకపోవడం దారుణమైన సంఘటన అని పేర్కొన్నారు. డేస్ స్కాలర్ పేరుతో స్కూల్ సిబ్బంది పట్టించుకోవడం సరికాదన్నారు. డేస్ స్కాలర్, హాస్టల్ విద్యార్థిని అనేది అధికారులు తేల్చాలని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు

తాగునీటి సమస్యపై ఆందోళనలు

నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పాడేరు: ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్వగ్రామం గుడివాడ వీధిలో తాగునీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం గుడివాడ మెట్ట వీధి మహిళలు ఖాళీ బిందెలతో ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించారు. కలుషిత నీటిని బాటిల్లో తీసుకొచ్చి ప్రదర్శించారు. అనంతరం గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, గుడివాడకు తాగునీటి సదుపాయం కల్పించకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో తాగునీటి కోసం ట్యాంకు నిర్మించామని, గ్రావిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రధానమంత్రి జలజీవన్ మిషన్ వంటి పథకాలు ఉన్నప్పటికీ కూడా ప్రభుత్వం గుడివాడ పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆమె నిలదీశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మెట్ట వీధి మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు

హుకుంపేట: తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని పాడేరు ఐటీడీఏ ఎదుట గిరిజనులు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండలంలోని మత్స్యపురం పంచాయితీ ఊటగెడ్డ, కంబిడి పుట్టు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిస్కారం చేయాలని కోరుతూ ఆ రెండు గ్రామాల ప్రజలు సీపీఎం హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం ఐటీడీఏ గ్రీవెన్స్ లో పీఓ అభిషేక్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన పీఓ జేజేఎం నిధులతో పాటు, ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఊట గెడ్డ,కంబిడి పుట్టు వార్డ్ మెంబర్ గోల్లోరి వెంకటేష్, మత్స్య పురం పంచాయితీ నాయకులు గోల్లోరి అప్పల స్వామి, టీడీపీ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి బోయిన శంకర్ నాయుడు, దేముడు, సిద్ధు, సప్పి అబ్రహం పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

నియామక ప్రతాన్ని ఇస్తున్న కార్యదర్శి, నాయకులు

కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా మొద్దు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండల పిఎసిఎస్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా జి.మొద్దు నూతనంగా నియమితులయ్యారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను స్థానిక కోపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి జి కేశవరావు శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఛైర్మన్‌కు అందజేశారు. నియమితులైన ఛైర్మన్ ఈనెల 23న ఆదివారం డైరెక్టర్ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కార్యదర్శి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి అధిష్టానం గుర్తించుకుంటుందని, ఇందుకు నిదర్శనం మాజీ ఎంపిటిసి మొద్దుకు కోపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ గా ఇవ్వడమేనని చెప్పారు. కార్యకర్తలు కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా పదవులు రావడం తద్యమని నాయకులు చెప్పారు. ఈ పదవిని అప్పగించిన ఎమ్మెల్యే ఫాల్గుణ కు మొద్దు కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్, మాజీ జెడ్పిటిసి ఎం.శ్రీరాములు, మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్, నాయకులు బి.సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, సర్పంచ్ వెంకటరావు, ఉపసర్పంచ్ జగ్గు నాయుడు, డి దాసు, త్రినాధరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

సమస్యలపై సిహెచ్‌డబ్ల్యుల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: సమస్యలను పరిష్కరిం చాలని సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (సిహెచ్‌డబ్ల్యు లు) ఐటీడీఏ ముందు బైఠాయించి శుక్రవారం ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లపై స్పందనలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్‌కు వినతి పత్రం అందజేశారు. పాడేరు డివిజన్లోని 11 మండలాల్లో ఉన్న 36 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా వర్కర్లుగా గుర్తింపబడని సుమారు 700 మంది సిహెచ్‌డబ్ల్యూలు పని చేస్తున్నామని పీవోకు విన్నవించారు. తామంతా ఆశా వర్కర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నామని, తమకు వేతనాలు చెల్లింపులో అన్యాయం జరుగుతుంద ని వారు ఆవేదన వెలిబుచ్చారు. ఈ ధర్నా నుద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ మాట్లాడుతూ, సిహెబ్ల్యులకు సమాన పనికి సమాన వేతనం అందడం లేదని అన్నారు. సిహెచ్‌బ్ల్యులకు కేవలం నాలుగు వేలు మాత్రమే నెలకు వేతనం అందుతుందన్నారు. ఆశా వర్కర్లుగా గుర్తించి పదివేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్ పంపిణీ చేయాలని, ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.దాసమ్మ పాల్గొన్నారు.

బొలెరో వాహనాన్ని ప్రారంభిస్తున్న జెసి, పిఒ

పిఎంఇజిపిని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పాడేరు: ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ ఆవరణలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో జెసి, పిఒ, శిక్షణ కలెక్టర్ బొలెరో రవాణా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి, పిఒ మాట్లాడుతూ, ఈ పథకం కింద 35 శాతం సబ్సిడీ ఉంటుందని, మిగిలిన 65 శాతం ఋణం పొంది వాయిదాలలో చెల్లించ వచ్చని వివరించారు.ఖాళీ సమయంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ ధన్ మార్టులకు కూడా సరుకులు రవాణా చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డిఆర్ఓ పి.అంబేద్కర్, డిఆర్డిఎ పిడి మురళి తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

25న బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రచార భేరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర

దుంబ్రిగుడ మండలంలో ప్రచార జాతాలో మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి- దుంబ్రిగూడ

కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వం, విద్వేషాలు రెచ్చగొడుతున్న కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర అన్నారు. మండలంలోని అరకు వారపు సంతలో శుక్రవారం సిపిఎం, సిపిఐ ప్రచార జీపు జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు గవర్నమెంట్ హై స్కూల్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన చట్టాలను తుంగలో తొక్కి ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్టులను నిర్మించడానికి కేంద్ర ప్రభ్యుం కుట్ర పన్నుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 25న అరకులోయ మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మండల నాయకులు టి.సూర్యనారాయణ, పి.సురేష్ కుమార్, పి సత్యనారాయణ, డివిజన్ నాయకుడు పి.మత్తు. కే రామన్న, పి.డుంబు నాయకులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : అరకువేలి మెయిన్ రోడ్డులో ఏప్రిల్ 25న ఉదయం 11గంటలకు జరిగే బహిరంగ సభ విజయవంతం చెయ్యాలనీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం జీపు జాత ప్రసారం చేశారు.అనంతరం కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, బహిరంగ సభకు సిపిఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సీపీఐ రాష్ట్ర నాయకులు జె.వి సత్యనారాయణమూర్తి హాజరు కానున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంత అడవులను ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పి గిరిజనులను అడవుల నుండి దూరం చేయడానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపీఎం మండల కార్యదర్శి కె.రామారావు, సుంకరమెట్ట సర్పంచ్ జి చిన్నబాబు, సీపీఎం మండల నాయకులు కె మగ్గన్న, పద్మాపురం ఉప సర్పంచ్ జె.భగత్‌రాం, నానిబాబు, సిహెచ్ గురుమూర్తి, ప్రజానాట్య మండలి నాయకులు జీ జోషి కే.కోగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : ఈనెల 25న అరకు లోయలో బహిరంగ సభను విజయవంతం చేయాలని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు కోరారు. హెక్టగుడ కొత్త వలసలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం మోపుతుందన్నారు.ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగులు, కె. శ్రీను పాల్గొన్నారు

కూనవరం : కేంద్ర బిజెపి విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీలు పిలుపు మేరకు ప్రచార భేరి కార్యక్రమం శుక్రవారం మండలంలోని బొజ్జారాయి గూడెం, తాళ్లగూడెం, కోడేరు గ్రామాల్లో సిపిఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సర్పంచ్ బొగ్గ రామారావు, సుబ్బయ్య, నానుపల్లి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సుమన్, హరీష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : సిపిఎం ప్రచార బేరి శుక్రవారం మండలంలోని తుమ్మల జిల్లేడు గుంపు, దేవరపల్లి గ్రామాల్లో సిపిఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో జరిగిన సమావేశాల్లో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు పల్లపు వెంకట్ మాట్లాడుతూ బిజెపి 9 ఏళ్లగా ప్రజాధనాన్ని దోచి కార్పొరేట్ శక్తులకు అప్పనంగా దోచిపెడుతుందని విమర్శించారు. జీవనాడల్లాంటి ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే దేశ అభివృద్ధిగా ప్రచారం చేయడం, దానిని ప్రశ్నిస్తే మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం బిజెపి ప్రధాన లక్ష్యంగా మారిందని విమర్శించారు. రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా వైసిపి ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోవడం దారుణమన్నారు. జిల్లేడు గుంపు గ్రామంలో మంచినీటి మోటారు పాడైపోయి నెల రోజులు కావస్తున్నా ఇప్పటికీ మరమ్మతులు చేయలేదని తెలిపారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సీతారామయ్య, మొత్తం రాజయ్య, కుంజ ముత్తయ్య, కూర విజయ్, పోడియం లక్షణ. సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ములకలపల్లి పంచాయతీ పరిధి జల్లవారి గూడెం గ్రామంలో ప్రచార భేరిని సిపిఎం నాయకులు నిర్వహించారు. ప్రతి ఇంటికి కరపత్రాలు పంచారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ జల్లివారిగూడెం, బంగారుగూడెం మధ్యలో ఉన్న వాగు వర్షాకాలం వచ్చిందంటే పది అడుగుల నీటిపారుదలతో రెండు గ్రామాలత ోపాటు 20 గ్రాములు రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వాగుపై వంతెన మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించినా తరువాత పనులు నిలుపుదల చేశారని తెలిపారు. తక్షణమే దానిని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సవలం మారయ్య, జల్లి సత్యనారాయణ, జల్లి శేఖర్, జల్లి సోమరాజు, జల్లి రాములమ్మ, జల్లి రాజమ్మ పాల్గొన్నారు.

చింతూరు మండలంలో...

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

కూనవరం మండలంలో ఉపాధి హామీ కూలీలతో సిపిఎం నాయకులు

విఆర్.పురం మండలంలో...

మారెమ్మ పండగకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఈనెల 23న జరగనున్న మారెమ్మ అమ్మవారి ప్రధాన పండగను పురస్కరించుకుని అధిక సంఖ్యలో బంధువులు, భక్తులు తాకిడిని దృష్టిలో ఉంచుకొని విశాఖపట్నం నుంచి సీలేరుకు ఆర్టీసీ అల్ట్రా డీలక్స్ స్పెషల్ బస్సు సర్వీసును ఈ నెల 22, 23 తేదీల్లో తిప్పడానికి ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ బస్సు విశాఖపట్నంలో శనివారం, ఆదివారం ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రానికి సీలేరు చేరుకుంటుంది. మరల అదే రోజుల్లో రాత్రికి సీలేరులో బయలుదేరి విశాఖపట్నం వెళ్తుంది. ఇప్పటికే విశాఖపట్నం, మధురువాడ డిపోలకు చెందిన రెండు నైట్ సర్వీసెస్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులకు ముందే సీట్లు రిజర్వేషన్ పూర్తి కావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అయితే మారమ్మ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు అదనంగా బస్సును ఏర్పాటు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళలపై తేనెటీగల దాడి

గాయపడిన మహిళ

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని జర్రాకొండ పంచాయితీ బురద గుమ్మి లో జల్ జీవన్ మిషన్ పైప్ లైన్ పనులు చేస్తున్న మహిళల పై అకస్మాత్తుగా తేనెటీగలు దాడి చేశాయి. కొంతమంది ప్రజలు తప్పించుకున్నారు. వృద్ధురాలు పరిగెత్తే లేకపోవడంతో ఆమె పై తేనెటీగలు దాడి చేశాయి. విషయం తెలుసుకున్న హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు అంబులెన్స్ ఏర్పాటు చేసి, హాస్పిటల్ కు తరలించారు.

ఎంపిటిసికి వైసిపి నేతల పరామర్శ

పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:అనారోగ్యంతో బాధ పడుతున్న మండలంలోని లైగండ పంచాయతీ ఎంపిటిసి సభ్యుడు బి.రామారావును వైసిపి నాయకులు బి.సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, మాజీ జెడ్పిటిసి ఎం శ్రీ రాములు, వైసీపీ మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్ , కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మొద్దు,శుక్రవారం లైగండ గ్రామంలో సందర్శించి ఆయనను పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలని ఆయనను వైసిపి నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సుల్లో ఆసుపత్రికి రోగుల తరలింపు

ఆసుపత్రికి బస్‌లో వెళుతున్న రోగులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తీగలవలస పంచాయతీ చుట్టుపక్కలో ఉన్న రోగులను శుక్రవారం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి అనీల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించనునట్లు సిబ్బంది పేర్కొన్నారు. గత రెండు నెలలుగా ఏజెన్సీ వ్యాప్తంగా రోగులను గుర్తించి అనిల్ నీరుకొండ హాస్పటల్ (తగరపువలస)కు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. 90 మందికి రెండు బస్సులు ఏర్పాటు చేసి ఆస్పత్రికి తరలించడం జరిగిందని హాస్పటల్ సిబ్బంది జాన్ని రాజారావు, జన్ని బొంజు బాబు,శోభ.రాంబాబు తెలిపారు.

స్పందన సమస్యల పరిష్కారంపై దృష్టి

ఐటిడిఎ పిఒ అభిషేక్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న పిఒ, అధికారులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, జెసి జె.శివ శ్రీనివాసు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. తాగునీటి సమస్యలు, విద్యుత్ సౌకర్యాలు, చెక్ డ్యాంల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలు మంజూరు, రోడ్డు సదుపాయాలు భూముల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 110 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఐటిడిఎ పిఒ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారానికి శాఖాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కోర్టు కేసులు, రిట్ పిటిషన్లను జిల్లా అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని చెప్పారు.

స్పందనలో ఫిర్యాదులు..

పాడేరు మండలం గొండిలి పంచాయతీ లింగాపుట్టు గ్రామస్తులు పలాసి సింహచలం, ఎస్.సోమరాజు చెక్ డ్యాం నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం గిన్నెలకోట గ్రామ పంచాయతీ చింతగరువు పాత కాలువపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కె.నాగరాజు, కొర్రా బొంజు నాయుడు దరఖాస్తు అందజేసారు. పాడేరు మండలం ముల్లుమెట్ట గ్రామం ప్రభుత్వ పాఠశాలకు మరుగుదొడ్డి, ప్రహరీగోడ నిర్మించాలని విద్యా కమిటి సభ్యులు పి.అమ్ములు, కె.రంభ తదితరులు వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ చాపగెడ్డ గ్రామం నుండి పనుగురాయి వరకు సిసి రోడ్డు నిర్మించాలని ఎంపిటిసి గడుతూరి నిర్మల వినతి పత్రం అందజేసారు. రాజఒమ్మంగి మండలం లాగరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉషశ్రీని డిప్యుటేషన్ రద్దు చేసి పిహెచ్ సిలో తిరిగి నియమించాలని లాగరాయి కింద్ర, కిర్రాబు, లబ్బర్తి గ్రామస్తులు రాజుబాబు, శ్రీను, బాలకష్ణ తదితరులు వినతిపత్రంలో పేర్కొన్నారు. రంపచోడవరం రెవెన్యూ డివిజన్ గంగవరం మండలం సూరంపాలెం పంచాయతీ దోనెలపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ బి.శివదొర, కె.దొంగబాబు తదితరులు వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం పెద కోడా పల్లి పంచాయతీ గొచ్చరిలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కొర్రా రామన్న, మర్రి లక్ష్మయ్య, అదేవిధంగా డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ పులుగుడలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని జి.రాంబాబు, కె.కొండ కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ పి.అంబేద్కర్, ఐటిడిఎ ఎపిఒ (జనరల్) వి.ఎస్.ప్రభాకరరావు, టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, ఐటిడిఎ పరిపాలనాధికారి హేమలత, టిడబ్ల్యు ఇఇలు డివి ఆర్ఎం రాజు, కె.వేణు గోపాల్, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ ఇఇ లీలాక్రిష్ణ, డిపిఒ పిఎస్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్, పిహెచ్ ఒ, ఎన్.అశోక్, వివద శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించాలి

విశాఖపట్నంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : న్యాయవాదులపై దేశవ్యాప్తంగా, రాష్ట్రంలోనూ దాడులు జరుగుతున్నాయని వాటిని అరికట్టే విధంగా న్యాయవాదులకు రక్షణ చట్టం బిల్లును ముసాయిదా సిద్ధం చేసి ఆర్డినెన్స్ జారీ చేసి శాసనసభలో చట్టంగా రూపొందించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం యూనిట్ నేతలు కోరారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రక్షణ చట్టం రూపొందించాలని, మహిళ న్యాయవాదులకు రెస్ట్ రూములు ఏర్పాటుకు చేయాలని, విశాఖపట్నంలో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు బిల్డింగును వెంటనే పనులను పూర్తిచేసి, మౌలిక వసతులు కల్పించి ప్రారంభించాలని కోరారు. న్యాయవాదుల రక్షణ చట్టం విషయమై తీర్మానం చేసి దీనిపై న్యాయవాదులతో సంతకాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు అధ్యక్షులు బి.వి.రామాంజనేయరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, చాట్ల ఆనంద రెడ్డి, కార్యదర్శి బగాది తులసీదాస్ తెలిపారు. న్యాయవాది పలక శ్రీరామ్మూర్తి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు

భూరక్షణ అందరి బాధ్యత

53వ వార్డులో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -కంచరపాలెం : భూమిని రక్షించుకోవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని జివిఎంసి ఐదో జోన్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా శుక్రవారం 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్, పార్వతీనగర్ తదితర ప్రాంతల్లో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. సమీప పార్కులో మొక్కలను నాటారు ఈ సందర్భంగా జెడ్‌సి మాట్లాడుతూ పంచభూతాలలో మానవాళి జీవనానికి ముఖ్యమైన నీరు, గాలి, భూమి కాలుష్యకోరల్లో చిక్కుకుని మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని, భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ తిరుమల తులసీ, సచివాలయ శానిటేషన్ కార్యదర్శి భవానీ, సూపర్‌వైజర్లు అమీనా, రామారావు జాకీర్ హుస్సేన్ నగర్ అధ్యక్షులు మున్నా, కార్యదర్శి వలి, భాషా పాల్గొన్నారు.

పాఠశాల పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని తాడిపుట్టు గ్రామ పంచాయతీ జీపీఎస్ స్కూల్ పనులకు శుక్రవారం స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నాడు నేడు కింద 13 లక్షలతో నూతన భవనం నిర్మిస్తారన్నారు.నాడు నేడుతో నూతనంగా పాఠశాల కు గ్రాంట్ విడుదల కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిలగడ లక్ష్మి, ఉపాధ్యాయులు అడప నాగరత్నం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

26న మల్లమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి డుంబ్రిగూడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఈనెల 26న మల్లమ్మ తల్లి గుహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ టి.సూర్యనారాయణ, బి.మోహన్ రావు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ గుహ జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలతోపాటు గిరిజన సంస్కృతిక సాంప్రదాయమైన పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు, గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

'104' కార్యవర్గం నియామకం

ప్రజాశక్తిపాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా 104 ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ నూతన కార్యవర్గం నియామకం శుక్రవారం పాడేరులో నిర్వహించారు. అధ్యక్షులుగా సూర్యనారాయణ పడాల్, ఉపాధ్యక్షులుగా కె.పవన్ కుమార్(చింతూరు), ప్రధాన కార్యదర్శి గా బి.రామ్మూర్తి నాయుడు (పాడేరు), సహాయ కార్యదర్శి గా జి.రవి రాజు (రంపచోడవరం) ట్రెజరర్లుగా బి.వరప్రసాద్ ఎస్‌కె నజీర్, గౌరవ అధ్యక్షులుగా వి.ఉమామహేశ్వరరావు (సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి) నియమితులయ్యారు.

24న జైభారత్ సత్యాగ్రహ సభ

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేత ముత్యాలు

ప్రజాశక్తి -గాజువాక : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, నిరంకుశధోరణితో వేధింపులకు నిరసనగా ఎఐసిసి పిలుపుమేరకు ఈ నెల 24న విజయవాడ జింఖానా మైదానంలో నిర్వహించే జైభారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని గాజువాక కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు పిలుపునిచ్చారు. ఈమేరకు చలో విజయవాడ ఆందోళన వాల్‌పోస్టర్లను గాజువాకలో ఆవిష్కరించారు. ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సారథ్యంలో నిర్వహించే జైభారత్ సత్యాగ్రహ మహాసభకు గాజువాక నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్య కర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ నేతలు కొవిరి కోదండరావు, సియ్యాద్రి అప్పారావు, యరబాల భూలోక, కొత్తపల్లి పెంటయ్య, కట్టా అప్పారావు, హరిబాబు, రాంబాబు, రాజు ఆనంద్ ప్రసాద్ షణ్ముఖ, షరీఫ్ పాల్గొన్నారు.

ఎర్రగొండమ్మ తీర్థ మహోత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం నడింపాలెం, శరభన్నపాలెం గ్రామాల్లో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఎర్రగొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 23న ఆదివారం ఉదయం 11 గంటల నుండి అరకు వారిచే థింసా నృత్యం,కోలాటం, శ్రీకాకుళం వారిచే తప్పెటగుళ్ల కార్యక్రమం జరగనుంది. అదే రోజు రాత్రి 10 గంటలకు బజర్దస్త్ నటులు అప్పారావు, రైజింగ్ రాజు, తాగుబోతు రాజమౌళి, వినోదిని, దొరబాబు, శ్రీదేవి డ్రామా కంపెనీ నుండి నెల్లూరు కవిత డ్యాన్స్ టీమ్ వారి డ్యాన్స్ బేబి డ్యాన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మల్లునాయుడుపాలెం వాసు గారి రేలా రెరేలా కార్యక్రమం నిర్వహించనున్నారు. 24న సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లి గూడెం వారిచే ధనరాజ్ పార్టీ శక్తివేషాలు, కాంతార శక్తివేషాలు, వేపగుంట వారిచే అమ్మాయిల తీన్ మార్‌తో అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుంది. రాత్రి 10 గంటలకు ప్రధానమంత్రి అవార్డు పొందిన మైకీ వండర్స్ విజ్ఞారీచే స్పెషల్ యాక్ట్, వైజాగ్ వారిచే డ్యాన్స్ బి డ్యాన్స్ ప్రదర్శనలు, తుని వారిచే దుర్గమ్మ పాట ఉంటాయి. 25 మంగళవారం రాత్రి 10 గంటలకు ఢీ సెలబ్రెటీస్ సాయి, నయినిక ఎంఎస్ డ్యాన్స్ ఈవెంట్స్, విశాఖపట్నం వారిచే డాన్స్ బేబీ డ్యాన్స్ ప్రదర్శించనున్నారు. శ్రీకాకుళం వారిచే గరివిడి లక్ష్మీ బుర్రకథ, రోజు రాత్రి వేట్లపాలెం వారిచే భారీ మందుగుండు సామగ్రి కాల్చడం జరుగుతుంది. 25న మంగళవారం 2 గంటల నుండి రాష్ట్ర స్థాయి గుర్రపు పోటీలు నిర్వహించనున్నారు. 23 నుండి 25వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం, రాత్రికి అన్నసమారాధన జరుగుతుంది. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ వారు కోరారు.

తునికాకు కట్ట రేటు పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎటపాక : తునికాకు కట్టరేటు పెంచాలని, తునికాకు కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని, బోనస్ డబ్బులు ఎప్పటివప్పుడు కల్లాల్లోనే చెల్లించాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలు తునికాకు కట్ట రేటు రూ.6 వరకు ఉందని, కానీ మన రాష్ట్రంలో నాణ్యమైన తునికాకు సేకరిస్తున్న కార్మికులకు అతి తక్కువ ధర చెల్లిస్తున్నారని తెలిపారు. నిత్యావసర సరుకులు ధరలు పెరిగిన నేపథ్యంలో తునికాకు 50 ఆకుల కట్ట ధర రూ.5కు తగ్గకుండా చెల్లిస్తేనే కార్మికులకు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కార్మికులకు బోనస్ కూడా కల్లాల్లోనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2012 నుండి బోనస్ డబ్బులు ఇంత వరకు చెల్లించలేదని గుర్తు చేశారు. తునికాకు సేకరణలో కార్మికులకు వడదెబ్బ, పాము కాటు లాంటి ప్రమాదాలకు గురైతే చికిత్స కోసం ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు.

పాంగి నూకరాజుకు నివాళి

ప్రజాశక్తి-కొయ్యూరు : సిపిఐ సీనియర్ నాయకులు, బంగారంపేట మాజీ సర్పంచ్ పాంగి నూకరాజు ఆరవ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నూకరాజు స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు మాట్లాడుతూ పాంగి నూకరాజు రెండు సార్లు సర్పంచిగా ఎన్నికై గ్రామ అభివృద్ధికి ఎంతో సేవచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నూకరాజు భార్య పాంగి రాజులమ్మ, కుమారుడు, కుమార్తె, రావణపల్లి ఎంపిటిసి ఇరువాడ సత్యవేణి, మాదల సత్యనారాయణ, వియ్యపు నానాజీ, కస్తూరి రమేష్, పోటుకూరి దారమల్లేష్, మాతే సన్యాసిరావు, ఉల్లి దేవసుందర్ భాయ్, తూర్రే రాఘవ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షునిగా సూరిబాబు

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) అధ్యక్షులుగా వైసిపి సీనియర్ నాయకులు సుమర్ల సూరిబాబు, డైరెక్టర్‌గా మొట్టడం సన్యాసిదొర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, చింతపల్లి ఎఎంసి చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్, వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబు, గాడి సత్యనారాయణ, పార్టీ నాయకులకు సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

అనకాపల్లి కలెక్టర్‌కు స్వచ్ఛభారత్ అవార్డు

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుంచి స్వచ్ఛభారత్ - 2022 అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. పరిపాలనా విభాగంలో స్వచ్ఛభారత్ ప్రమోటింగ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంట్రల్ ద్వారా ఉత్తమ సేవలు అందించినందుకుగానూ ఈ అవార్డు దక్కినట్టు కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆయన్ని పలువురు అభినందించారు.

కమిటీలు కాలయాపనకేనా ?

పంచ గ్రామాల భూ సమస్య కొలిక్కి వచ్చేనా..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పంచ గ్రామాలు' - విశాఖ, ఉత్తరాంధ్రలో ఈ పేరు వినని వారుండరు. ఒకటా...రెండా.. దశాబ్దాల నాటి భూ వివాదమిది. అందులో చిక్కుకుని పాతికేళ్లుగా పాలకుల చేతిలో మగ్గిపోతున్న పంచగ్రామాల రైతుల కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిటీలు వేసి కాలయాపన చేయడం ఆనవాయితీగా మారింది. దశాబ్దాల పాటు భూములను సాగుచేస్తూ జీవిస్తున్న వేల మంది రైతులు, వారి కుటుంబ సభ్యులకు ఈ వివాదం తీరని వేదన మిగులుస్తోంది. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్లకు సైతం మరమ్మతులు చేసుకునే అధికారం రైతులకు లేదు. బోర్లు వేసుకునే వెసులుబాటూ లేదు. అధికారులు సైతం ఈ పంచగ్రామాల భూ వివాదాన్ని మరింత జఠిలం చేస్తున్నారు. సింహాచలం లక్ష్మీ నృసింహస్వామి పుణ్యక్షేత్రం ఒకవైపు, వందల ఎకరాల భూమి, ఐదు గ్రామాలకు చెందిన 12 వేల మందికిపైగా ప్రజలు మరోవైపు కమిటీలు, కోర్టు కేసులతో నలిగిపోతుండం దశాబ్దాల నుంచీ కొనసాగుతోంది.

పంచ గ్రామాలు.. కమిటీల కథ

పంచ గ్రామాలుగా పిలవబడే అడవివరం, చీమలాపల్లి, పురుషోత్తమపురం, వేపగుంట, వెంకటాపురంల్లో సుమారు 1730 ఎకరాల మాగాణి, మెట్ట, బంజరు, పోరంబోకు భూములు స్థానిక ప్రజలు, రైతుల సాగుబడిలో ఉన్నాయి. విశాఖ నగరాభివృద్ధి జరుగుతున్న క్రమంలో పాలకుల కళ్లు ఈ భూములపై పడి వాటిని వారికి దక్కకుండా దేవుడిమాన్యంలో కలిపేసే కుట్రలు కొనసాగుతున్నాయి. 1996లో నాటి పాలకులు తొలుత ఇందుకు ఆజ్యం పోశారు. 2019 నుంచి నేటి వరకూ వైసిపి ప్రభుత్వం మూడు కమిటీలు వేసింది. ఈ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పంచ గ్రామాల భూ సమస్యను తాను అధికారంలోకి వచ్చీ రాగానే పరిష్కరిస్తానని 2019లో ఎన్నికల హామీ ఇచ్చారు. 2023లో వేసిన కమిటీలో దేవాదాయ శాఖ మంత్రి, విశాఖ మంత్రి మంత్రి అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని అధికారికంగా ఉంచారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ సహా సింహాచలం దేవస్థానం ఇఒ కూడా ఉన్నారు. అనధికారికంగా పెందుర్తి ఎంఎల్ఎ అదీప్‌రాజు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కూడా ఈ వ్యవహారంలో భాగస్వాములౌతున్నారు. మొత్తంగా పంచ గ్రామాల్లో 11,282 ఎకరాల భూమి ఉండగా చంద్రబాబు కాలంలో 9069 ఎకరాల భూమికి పట్టాలిచ్చారు. మిగిలిన 1785 ఎకరాలకు సంబంధించి 'పంచ గ్రామాల' భూ సమస్య కొనసాగుతోంది.

2000 దశకంలోకి వెళ్లి చూస్తే..

1996లో చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన పట్టాలను ఆధారం చేసుకుని 2000లో ప్రభుత్వం 578 జిఒ ఇచ్చింది. అది 2004 ఏప్రిల్ వరకూ అమల్లో ఉంది. ఆ తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వాన కాంగ్రెస్ ప్రభుత్వం 2005 మార్చి 5న ఆ జిఒను రద్దుచేస్తూ మరో జిఒ 253ను ఇచ్చింది. కాంగ్రెస్ నేత ద్రోణంరాజు సత్యనారాయణతో కమిటీ వేసింది. ఓ పక్క ఈ కమిటీ ఇలా వేశారో లేదో.. మరోపక్క అదే ఏడాది అక్టోబర్‌లో పీఠాధిపతులంతా దేవాదాయ భూములన్నీ అన్యాక్రాంతం అవుతున్నాయని కోర్టుకు వెళ్లారు. ఈ ప్రాంతంలో పంచగ్రామాల సమస్య కూడా ఉండడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

కమిటీలతో కాలయాపన, కేసులతో మోసం చేయడం తప్ప నాటి టిడిపి, కాంగ్రెస్, నేటి వైసిపిలు చేసిందేమీ లేదు. రైతులు అడుగుతున్న 1785 ఎకరాల భూమి పరిష్కారానికి చిత్తశుద్ధి కనబర్చలేదు. 2024 ఎన్నికల నేపథ్యంలో మళ్లీ నేతల నోట నుంచి ప్రకటనలు రావడంతో తాజాగా పంచగ్రామాల రైతుల్లో ఆగ్రహం రేగుతోంది. మాజీ మంత్రి ముత్తంశెట్టి సోదరుడు ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో 10 ఎకరాలు తీసుకుని రైతుల భూముల నుంచి రహదారి వేసుకుంటే లేని ఆటంకం మా భూమిని దఖలు చేయడానికే వచ్చిందా ? అంటూ పంచగ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చందనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ఏర్పాట్లు తీరును తెలియజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - సింహాచలం : ఈ నెల 23న జరగబోయే చందనోత్సవాల్లో సామాన్య భక్తులకు ఎటువంటి లోటుపాట్లూ జరగకుండా దర్శన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం సింహచలం కొండపై ఆనందనిలయంలో చందనోత్సవ ఏర్పాట్లుపై పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనోత్సవం సందర్భంగా ఈ నెల 23 తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 మధ్య ఆలయ ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులతో పాటు దేవాదాయశాఖ మంత్రివర్యులు స్వామివారిని దర్శించుకుంటారని, అదే సమయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. అనంతరం 3.30 నుంచి 4.30 గంటల మధ్య వివిఐపి దర్శనాలు ఉంటాయన్నారు. దేవస్థాన ట్రస్టు సభ్యులు స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. రూ.300, రూ.1000, రూ.1500 టిక్కెట్లలో దర్శన వేళలను ముద్రించనున్నట్టు తెలిపారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉచిత దర్శనంతో పాటు టిక్కెట్లపై భక్తులు స్వామివారి దర్శనం చేసుకోవచ్చున్నారు. వివిఐపి స్లాట్‌ల వివరాలు వెల్లడించారు. ప్రతి 20 మీటర్లకు ఒక వాటర్ పాయింట్‌ను దేవస్థానం, జివిఎంసి ఏర్పాటు చేశాయన్నారు. శానిటేషన్, మరుగుదొడ్ల ఏర్పాట్లును జివిఎంసి చూస్తోందన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నిరంతరం విద్యుత్తు ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. పోలీసు కమిషనర్ డాక్టర్ సిఎం.త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సింహాచలం ఇఒ త్రినాథరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అజాద్, డిసిపిలు ఆనందరెడ్డి, వి.నాగన్న, విద్యాసాగర్ నాయుడు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత వారు చందనోత్సవ ఏర్పాట్లును పరిశీలించారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బుచ్చమ్మ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ గ్రామ సర్పంచ్ కారం బుచ్చమ్మ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విఆర్ పురం నుండి రామవరం మీదుగా చింతూరు నిత్యం చిరు వ్యాపారులు 35 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుధీర్, పంచాయతీ కార్యదర్శి తాతారావు, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని నెల్లిమెట్ల గ్రామానికి గిరిజన మహిళ శుక్రవారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. రాజవొమ్మంగి ఎస్ఐ టిజి నరేంద్ర ప్రసాద్ కథనం ప్రకారం... మండలంలోని లబ్బర్తి పంచాయితీ నెల్లిమెట్ల గ్రామానికి చెందిన తాము బేబీరాణి తన భర్త లోవరాజును మద్యం తాగ వద్దని చెప్పింది. ఆయన వినక పోవడంతో ఇద్దరి మధ్య శుక్రవారం ఉదయం గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో క్షణికావేశంలో బేబీరాణి ఇంటి వద్దనే ఉన్న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108లో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో బేబీ రాణి శరీరం 60 శాతం కాలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేంద్ర ప్రసాద్ తెలిపారు.

పల్లాల సూర్యనారాయణ రెడ్డి ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని జిఎం.వలస గ్రామానికి అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ పల్లాల సూర్యనారాయణ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ నాయకులు కె.శాంతకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సంఘం నాయకులు పి లచ్చిరెడ్డి మాట్లాడుతూ సూర్యనారాయణ రెడ్డి గిరిజన ప్రాంతాల్లో జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొని గిరిజనులకు అండగా నిలిచారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన గిరిజనులకు చేసిన సేవల ఫలితంగానే రెండు దఫాలుగా సర్పంచ్‌గా ఆయనకు ప్రజలు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.బాల్ రెడ్డి, ఎం.జోగమ్మ, కె.సుగ్రీవుడు, ఐ.బాల్ రెడ్డి, బి శ్రీదేవి, పి ధర్మారెడ్డి పాల్గొన్నారు.

పుష్కరాలకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గంగా పుష్కరాల సమయంలో ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించే క్రమంలో రైల్వే శాఖ గుంటూరు -బెనారస్ (వారణాసి) - గుంటూరు మధ్య 07230/07229 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపాలని నిర్ణయించింది. 07230 గుంటూరు - బెనారస్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 22, 29, మే 6 తేదీల్లో ప్రతి శనివారం రాత్రి 23.45 గంటలకు గుంటూరులో బయలుదేరి సోమవారం సాయత్రం 16.30 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 07229 బెనారస్ - గుంటూరు ప్రత్యేక రైలు ఏప్రిల్ 24, మే 1, 8 తేదీలలో ప్రతి సోమవారం సాయంత్రం 18 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.43 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 20:45 గంటలకు బయలుదేరి తర్వాతి రోజు ఉదయం 6:30 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఈ జంట రైళ్లు విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, రాయగడ, మునిగూడ, తిట్లాగఢ్, బర్ఘర్, జె.రోడ్‌పూర్, సమ్‌కోర్ స్టేషన్లలో ఆగుతాయి.